"అలుక"

పూడిపెద్ది వెంకటరమణయ్య

"జొనురా విశ్వం! ఎంతసేపని నీకోసం కని పెట్టుకొని ఉండడం? కార్తీకసోమవారం; పగలల్లా మాడి ఇన్ని మెతుకులు నోటకొట్టుకుని పెందలాడే పడుక్కుందా మనుకున్నాను. ఇప్పటికీ లేదాయనా, అప్పటికీ లేదాయను నీరాక! బాగుంది!" కొడుకును అసంతుష్టితో చూచింది మల్లమ్మ ఎగాదిగా.

విశ్వ:—ఎందు కారొసరొసలమ్మా నీకిష్టముంటే ఇంత అన్నంపెట్టు లేకపోతే పోనీ.

మల్ల:—అలాగేగాని, అవతల ఏమిటిరా నీకుపని? ఉద్యోగాలా, ఊళ్ళా? చదువు సంతకెళ్ళిందిగదా? తిని తిరగడాని కింతతీరుబాటు లేకపోవడమా?

విశ్వ:—నాయిష్టం.

మల్ల:—(కోపంగా, భయంగా వానిముఖం చూచి) అలాగా? అందుకే అన్నీ అలానిబ్బ జేరుతున్నాయి. నిరుడు నీకు పిల్లనిస్తానన్న నీలాద్రిరాజుగారి యేడుమర్లో సంబంధం చూచుకున్నారు? ఎవరిస్తారు, ఎందుకిస్తారు? విద్యచూచా? బుద్ధిచూచా?

విశ్వ:—అక్కరలేని చదువులేం చదువకువిూ! (ఎఱ్ఱగా చూచేడు తల్లివైపు)

మల్ల:—అయ్యో నాతండ్రీ! ఏమిటిరా అలా చూస్తావు? భయపిస్తావేమిటి? క్రుద్ధువచ్చి పిల్లనాభ్రమించిందట.

విశ్వ:—మాట్లాడకు.

మల్ల:—నాయింట్లో నీయాజ్ఞ ఏమిటి? నీకిష్టముంటే రా! ఇంతముద్దపడేస్తాను, తినిపో!

విశ్వ:—నాకక్కరలేదు నీముద్దా మక్కలూను.

మల్ల:—(జంకింది) ఏమో! ఎప్పటికేనా బుద్ధి వస్తుందో బాగుపడతావో అని అన్నాను, నాకేలా? చిన్నపిల్లడవుకావుగదా! రా. లోపలకువచ్చి అన్నం తిను.

విశ్వ:—నేను తినను. నాకక్కరలేదు.

మల్ల:—పీటూవిస్తరీ వేసేను. వేసిన విస్తరి తియ్యకూడదు. రా, కాళ్ళుకడుక్కో.

విశ్వ:—నాకువద్దంటే తెలీదేమిటి? నాకక్కర లేదు. (కచ్చితంగా చెప్పేడు.)

మల్ల:—ఇంకెప్పుడూ నీకూసు పెట్టనులే! (విషాదంగా నవ్వింది)

విశ్వ:—నేనురాను.

మల్ల:—నాతండ్రివికావూ! చాలారాత్రి అయిపోతూంది. ముసలిముండాకూతురనూ. చలికాలం. రానాయనా? నన్ను దుఃఖపెట్టకు. ఇదిగో పాత్రిపంచ-" అంటూ పాత్రిపంచ చేత్తోపట్టుకొని కొడుకుదగ్గరా వెళ్ళింది.

వి:—(కోపంగా) నేనిక్కడుంటేగద ఇంత అల్లరి చేస్తావు? నేపోతాను.

అని గబగబా వీధిలోకి వెళిపోయాడు "ఆఁ! ఏవిూ! నన్నెందుకనాలి? నే నొప్పుకోను."

గుమ్మంలోకి వెళ్ళింది మల్లమ్మ. విశ్వం వడివడి నడిచి వెళిపోతున్నాడు. "ఒరే విశ్వం! బాబూ! ఇదిగో నామాట వినవూ?" అని జాలిగా పిలిచింది - మాటమణుగుతూన్న మాపటివేళ నిశ్శబ్దం నిండుతూంది. విశ్వం జబాబు చెప్పకుండా వెళిపోతున్నాడు.

విశ్వం, గూడగట్టూ, లలాటంకప్పిన క్రాపింగు ముంగురులూ పొట్టిచేతులలాల్చీ - రస్తాప్రక్కను వెలిగే దీపాలూ అలాగే ఉన్నాయి. తొందరతొందరగా నగుస్తున్నాడు విశ్వం నిర్లక్ష్యసూచకంగా ఊల పాడుతూ ఊహించుకుంటూ. టక్కుమని ముందుకు

త్రుళ్ళి ఆగుకున్నాడు.- 'అమ్మ!' అన్నాడు. కుడి పాదం రెండవ వ్రేలు రాతిని తాకింది. శీతకాలపుదెబ్బ. కిరకిరలాడేడు విశ్వం. దీపస్తంభంచేరువకుపోయి వ్రేలు తడిమిచూచుకున్నాడు. తడిమాత్రం తెలిసింది. నెత్తురు వస్తూంది కాబోలు - జేబులో చేయిపెట్టి చేతిరుమాలు తీసి దానినిచించి చిన్నపీలికతీసి వ్రేలికికట్టుకున్నాడు. 'ఇదొక లక్ష్యమా' అన్నట్టు తిరుగా నడక ప్రారంభించేడు. పదుమలుపుదగ్గర నిలచేడు. "బాబూరావు బసకు పోతాను. పడుక్కుందికి పరుపిస్తాడు. చాలు. అంతే. నాతో ఒకటేపంతం. కానీచూదాం" అనుకొని సందుమళ్ళేడు. బాబూరావుగది మేడమీదఉంది. దీపంవెలుగులేదే! నిదానించి తలయెత్తి ఆగదివైపు చూచేడు. "పిల్లిలాగు వీడు చలికి ముడుచుకొనిపోతాడు. అన్నితలుపులూ మూసుకుని ఆగదిలో చదువుతూ ఉంటాడు" వీధితలుపు తట్టేడు - జబాబులేదు. బాబూ రావ్ బాబూరావ్ అని రంయిమని కేకపెట్టి పిలిచేడు. ఎవరో గొణుగుకుంటూ వీధితలుపు తెరచేరు. చీకటి. ఒరే బాబూరావ్ అంటూ లోపలప్రవేశించబోయాడు విశ్వం. "ఎవరు నాయనా నువ్వు? తలుపులు బ్రద్దలుకొట్టేస్తున్నా వర్ధరాత్రివేళ. బాబూరావులేడు గాబూరావులేడు."

విశ్వం:—(ఆడుగొంతకవిని తెల్లబోయి నిలబడి) మేడమీదగదిలో అద్దెకున్నాడు; అతడమ్మా బాబూరావంటేను.

(లోపలనుండి) ఇంట్లో లేండే!

విశ్వం:—ఎక్కడికి వెళ్ళాడు?

(లోపలనుండి) "బాగుంది! నాకేం తెలుసు. నాతో చెప్పి వెళ్ళాడా ఏమిటి" అంటూ తలుపుగడియ టక్కునవేసింది.

చీడీఅంచున నిలబడి చీకటిలోకి అటూయిటూ చూచేడు. ఏంచేయడం? రాత్రిముదిరింది. అందరూ పడుక్కునేవేళకూడా అయిందేమో. ఎక్కడకు వెళ్ళడం? నిశ్చయించుకోకుండా మెట్లుదిగేశాడు. చలిగాలి రంయిమని వీచింది. చేతిరుమాలుతీసేడు జేబులోనుండి - తలకు చెవులుకప్పి కట్టుకుంటే కొంత చలితగ్గుతుందని. అది మొగంక్రిందికి దిగిందికాదు. దానిలో పీలికతీసి వేసేడుకాదూ! గాయం స్ఫురణకువచ్చింది. వ్రేలు పోటు పెడుతూంది. నడక మందగించింది. దూరంగా ఏదో దుకాణం కనిపించింది చిన్నదీపపు వెలుగులో. ఏదైనా తిందామనిపించింది విశ్వానికి. అటునడుస్తూ జేబు తడుముకున్నాడు. ఉంది వెండిపావులా. చాలు. దుకాణదారుడు సామానులుసద్దుకుంటున్నాడు గదిలో. ఓయ్ - ఓయ్ అంటూ విశ్వం వానిని సమీపించేడు. వాడు విశ్వాన్ని అనుమానంగా, ప్రశ్నార్థకంగా చూచేడు - రెండు కమలాపళ్ళియ్యి అని దర్జాగా జేబులోనుంచి పావులాతీసి బల్లమీదపడవేసేడు. దుకాణదారు పావులాను - చాలీచాలని దీపపువెలుగులో పరీక్షించి పరీక్షించి- "వద్దు బాబూ! నాకీపావులా చెల్లదు" త్రుళ్ళిపడ్డాడు విశ్వం. 'ఏదీ?' అని ఆపావులా అందుకొని తాను పరీక్షించడం మొదలెట్టేడు. దడదడా కొట్టు సర్దుకుని దుకాణదారు దీపమార్పేశాడు. విశ్వం నిర్విణ్ణుడయి నిలచిపోయాడు. ఈనిరర్థకత వానిలో ఆకలిని కదిపింది - ఆకలివేస్తూంది. ఏమిటి తినడం? ఎక్కడా ఏమీ దొరికే ఉపాయంలేదు. "ఆకలి! ఆకలి! ఇంతా అయితే ఆకలి నన్నేంచేస్తుంది! ఏమీ చెయ్యలేదు. దానికి లొంగుతే అది మనలనే మ్రింగుతుంది. అల్పవిషయాల నటుండమనాలి." అనుకున్నాడు. రెండడుగులు పెట్టేడు. "ఔను" కడుపు నిండా నీళ్ళుత్రాగిస్తే ఆకలిచస్తుంది. అంటూ ఆచేరువనున్న కొళాయికట్టడాన్ని సమీపించేడు. కొళాయి మీటనొక్కాడు 'గుంయి' మని హోరుపెట్టిందాగొట్టాం." అయ్యో! మరచిపోయాను. రాత్రులు కొళాయిలుండవు. ఇంతకీశీతాకాలం దాహమంటే నాకే నవ్వువస్తూంది. ఆకలిమరచిపోవడానికి నీరుత్రాగాలనుకున్నానుగాని నిజంగా నీరుజరూరు లేనేలేదు. చిన్నపోవడం ఎందుకూ?" అనుకుని అలా తిరుగా రోడ్డుమీదనుండి నడిచిపోతున్నాడు. "కాలు పోటుపెడుతూంది. ఈ అరుగుమీద కూర్చుంటే కొంచెం ఉపశమిస్తుందేమో!" అనుకుని అక్కడయింటి పెద్ద అరుగుమీదికెళ్లేడు. "బాగుంది అరుగు తెల్లగా, నున్నగా

కాని పొడుముండాకాలం - చుర్రుమంటూంది నేలం టుతే. కొంతసే పలాగుంటుంది. మనశరీరం వేడితగుల్తే చలువా గిలువా ఎగిరిపోతుంది." చతికిలపడ్డాడా అరుగుమీద. "బాబూరా వేమయినాడో! పొడుముండా పంపులా చెల్లిందికాదుగదా! బాబూరావెందుకూ?" అరుగంతా కలయజూచి "ఇక్కడ సాగోరితే నిద్రపట్టిపోతుంది. నిద్ర సుఖమెరగదు. కళ్ళు మెయ్యా నిద్రవస్తే ఆకలిమాత్రం ఎవడుగుర్తిస్తాడు?" మెల్లగా ఆ అరుగు ధూళిదులుపుకొని పడుక్కున్నాడు. ఒడలుజల్లుమంది ఆ చల్లదనానికి. గుండెలోనుండీ కుదుపువచ్చింది. లేచి కూర్చున్నాడు. గూటకట్టువిప్పి నేలనుపరచి చెడ్డీతో పడుక్కున్నాడు. అంతవరకూ బట్టలోనున్న కాళ్ళ క్రిందిభాగాలలోనుండీ చలిరేగింది. ముడుచుకొని పడుక్కున్నాడు, చలితగ్గలేదు. లేచికూర్చున్నాడు. మొల కట్టుపంచ తలమీదనుండీ కప్పుకున్నాడు. కొంచెం చలి తగ్గినట్టనిపించింది. "ఏంతగ్గడం - చలిచేరరాకుండా దానివాకిట్లో ఇలాగు కావలి కూర్చోవాలి కాబోలు!" అరుగందున స్తంభానికి చేరబడి అదోలాగు చూచేడు. ఎదురుగా అరుగుమీదికే ఒకమూయబడ్డ ద్వారం కనుపించింది. వీధికొట్టంటారు దాన్ని. అది కాళీగానే ఉంటుంది. ఎప్పుడో అవసరంపడితే ఆయింటివాళ్ళు వాడుకుంటారు. దిగ్గనలేచి ఆతలుపుగొళ్ళెం తీసేడు విశ్వం. - చీకటిని చించుకొని గది పరీక్షించేడు. నిర్మలంగా ఉన్నట్టే ఉంది. నైర్మల్యంమాట దేవుడెరుగును, వెచ్చగాఉంది. "ఆఁ! బాగుంది. - చలిబాధతగ్గి నిద్రపడితే అన్నిబాధలూ తగ్గుతివి. ముసుగుపంచ నేలను పరచుకొని, కాలివ్రేలికట్టు తడిమి సరిచూచుకుని, పడుక్కున్నాడు బ్రతుకుజీవుడా అనుకొని. వానికి కూరుకుపడుతూంది తెలివివస్తూంది. తలుపు చేరపెట్టుకున్నాడు. చలిగాలి వీస్తూంది. కన్నులు బరువుగా విప్పేడు. ఎదుట దీపపువెలుగు కనిపించింది. ఒక వితంతువు ముసిలిది దీపంచేతపట్టుకొని వచ్చింది. ఆమె కొట్లోకి చూచి,

"ఎవడో ఉన్నాడే కాముడూ ఇందులోను" అంది.

చిన్నబోయేడు విశ్వం. దిగ్గవలేచి యీవలకు వచ్చేడు. ఎవరు నాయనా నువ్వు, ఇందులో దూరేవు? వెళ్ళు. బాగున్నావు డొంకలాతలా నవ్వావు" మెట్లు దిగేశాడు విశ్వం. ఎటేనా పోదామనుకున్నాడు. ఆ మాత్రం వెచ్చదనం మరిగిన వాని శరీరం చలికి మరింత గడగడలాడుతూంది. అక్కడింకా మసలుతే ఆయింటి వాళ్ళు అనుమానిస్తారు. గూటకట్టు పంచ తిరుగా తల మీదనుండీ ముసుగుపెట్టుకొని ఓరఓరలనుబట్టి నడిచి వస్తున్నాడు. ఎటువెళ్ళడం? ఎంతరాత్రి అయిందో. ఏసంవడీలేదు వీధిలో. నడచిపోదామన్నా కాళ్ళురావు. కడుపుబాధిస్తూంది - కాలివ్రేలు సలుపుతూంది. చలికి శరీరం కొంకరపోతూంది ఆపై నింకా రోషం తల చూపుతూనే ఉంది. ఇంతచలిలోనూ నెత్తుటిఉడుకు! "నాకేమిటి? ఎక్కడికిపోయినా పోతాను. ఇవో లక్ష్యమా? తుపానుపెట్టి నన్ను తృణంలాగు తూల్చేసినా పిట్టలా గగురుతానుగాని పిరికిదనం మొలకెత్తనిస్తానూ?" నిజంగా పిరికిదనం వానిహృదయాన అంకురిస్తూంది. ఆందోళన సజీవంగా సంచలిస్తూంది. అపార్థం చేసికొంటున్నాడు. నిరాశా, నీరసంకూడా వాని కనుచరులయి ఆవలాయీవలా కదలుతున్నాయి. అలక్ష్యం, శౌర్యం ముందంజవేస్తున్నాయి. తనలో తానయినా ఒప్పుకోనొల్లని ఒకవిధమయిన దైన్యం అప్పుడే ఆవహించింది. వానిని దిగలాగడం మొదలెట్టింది.

వ్రేలు రువ్వురువ్వుమని సూదులతో పొడిచినట్టు పోటుపెడుతూంది. అడుగులు ఊది వేస్తున్నాడు. ఎంచేతోగాని ఈడ్గిలపడుతున్నాయి అడుగులు. "ఔను! ఎందుకిలావెళ్ళడం? ఎక్కడకు? వెనుకకుపోతేనే నయం. ఈపాటికి బాబూరావు ఇంటికి వచ్చేఉంటాడు. అటు పోతేనే మంచిది. ఇంకా జామురాత్రికిపైగా ఉంటుంది కాబోలు. ఎక్కడో ఒకచోట తలదాచుకోవాలి. కాదు మిగిలినరాత్రిగడపాలి" "కొన్ని అడుగులు పెట్టేడు? ఆలోచన మారి అలానిలచేడు. బాబూరావుంటే మాత్రం? వాడివీథితలు పోవ్యాసఘట్టం. ఎవరు తీస్తారు. మనకేక వాడికే వినబడుతుందా ఏమిటి? ఇరుగుపొరుగువాళ్ళు లేచి నన్ననుమానించడం, విసుక్కోడం ఇదేమిగులు.

ఇంతకూ వాడుంటాడో, ఉండడో ? ఏలా వృథా ప్రయత్నం?" అలాఅనుకుంటూ రోడ్డుప్రక్కనున్న యిండ్లన్నీ కన్నులింతేసిగా విప్పి చూస్తున్నాడు అడుగులు మందగించేయి. ఆనిదానంలో చోటుకనబడ దెక్కడాను. "స్వతానికిపోతేనో! అయ్యో! ఎంత తెలివితక్కువ! ఇంత సేపూ నాకీఉపాయం స్ఫురణకేవచ్చింది కాదు. అది అందరిసొత్తూను. అడ్డేవాళ్ళూ, పొమ్మనే వాళ్ళూ, అధికారం సెరపేవాళ్ళూ ఉండరుగదా!" మెద్దులోనే మెలకువచూపెడుతూ చురుకుగా అటునుండి ఇటుతిరిగి పదిఅడుగులకుపైగా నడచి, "అన్నట్టు అక్కడ కావలిగా దుంటాడు వాడు నేను పరదేశస్థుడనంటే నమ్మి చోటుపెడతాడా? అనుమానించి అందరినీ లేపి చూపుతాడేమోనన్న" అలా నిలబడిపోయాడు. ఏంచెయ్యడం అన్న ఆంతరంగిక ప్రశ్నకూడా శబ్దించలే దాహోప్రదేశంలో. ఊహే లేని ఎడారిలాగు శూన్యతే ఆవరించింది వానిమనస్సును క్షణకాలం. క్రొమని కీచుశబ్దం రేగింది చేరువగా. నిద్రమేల్కొన్న సైనిక దళంలాగా ఊహావీథి కల్లోలమయింది. కళవళపాటు యుద్ధభేరీలాగు నినదిస్తూంది వానిచెవులలో. భీతి ప్రాకిం దాహృదయావరణలోకి. దానిని సూచించుటకా నిశ్శబ్దనిశాసమయంలో వాని గుండె దడదడలాడింది. జారిపోతుందేమో నన్నట్టు అరచేత గుండెనదుముకొన్నాడు. గట్టిగా అకారణభయంతో "అదేమిటి చెప్మా" అని ఆలోచించేడు. ఏమయితే ఏంచేయగలడు? ఎందుకూ ఆ ఆలోచన? సందుకొసకు దృక్కులు సాగించి చూచేడు. జాడేమీ దొరక లేదు. పిట్టకూత కాబోలు. ఇంకా రాత్రి ఎక్కువగాఉంది కాబోలు. నిలబడేచూస్తున్నాడు అన్నిదిక్కులా. నీడలాగా కొసనకనుపించిందేదో కదుల్తూ. మనుష్యుడే. ఇద్దరు కాబోలు. ఇటేవస్తున్నారేమో. సమీపిస్తున్నారు. బారెడుదూరంలో ఉన్నారు. జోడుకాళ్ళచప్పుడు వినబడుతూంది. పోలీసువాళ్ళు. 'వి లు' వేసి కలుసుకున్నారు. విశ్వాన్ని సమీపిస్తున్నారు.

విశ్వమేం చేస్తాడు?

ఆంధ్రవాఙ్మయసూచిక

(ముద్రితాముద్రితగ్రంథముల పట్టికలు)

ఈ పుస్తకమున ౧౯౩౧-వ సంవత్సరము చివరవరకు అచ్చయిన తెలుగుపుస్తకముల పట్టిక ఒకటి, ఆ పుస్తకములను వ్రాసినవారి పట్టిక ఒకటి, విషయమునుబట్టి విభాగించి ఆయా విభాగములక్రింద వచ్చిన పుస్తకముల పట్టికలు, ఇంకా కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తు లైబ్రరిలోను, తంజావూరు సరస్వతీ లైబ్రరిలోను, చెన్నపురమున ఓరియంటల్ లైబ్రరిలోను ఉండే వ్రాతపుస్తకములలో ఇప్పటికి అచ్చుకాకుండ ఉన్న తెలుగుపుస్తకముల పట్టికలును, ప్రత్యేకము అకారాదిగా ఉన్నవి. ఆంధ్రవాఙ్మయవిమర్శనరూపమయిన ప్రకాశికులపీఠిక ౧౦౭ పుటల పరిమితి గలది యీపుస్తకమున ఉన్నది.

తెలుగుభాషలో పుట్టిన పుస్తకములను, వానిలో, ఈపుస్తకము ముగియునప్పటికి అచ్చయినవానిని, కానివానిని తెలిసికొనుటకు ఈ సూచిక చాల ఉపయోగకరము.

భారతిసైజు పుస్తకము, పుటలు ౬౨౦, మంచికాగితములు. వెల రు. ౧-౦-౦ మాత్రమే.

మేనేజరు, **ఆంధ్రగ్రంథమాల**, నెం. 7, తంబుసెట్టివీథి, మ్రదాసు.